
సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 19 । జనవరి । 2024



వేమా.. వందనం..!

యోగివేమన విశ్వవిద్యాలయంలో శుక్రవారం వేమన జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య బి. పార్వతి తెలిపారు. -8లో



తనిఖీల్లో నగదు స్వాధీనం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు.బద్వేలు–మైదుకూరు రహదారిలో రూ.9లక్షలు, రిమ్స్‌పరిధిలో రూ.2లక్షలు స్వాధీనం చేసుకున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 103 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ఆదాయంలో రికార్డ్

మైదుకూరు: మైదుకూరు ఆర్టీసీ డిపో ఆదాయంలో రికార్డ్ సృష్టించినట్లు డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. సంక్రాంతి తిరుగుప్రయాణాల కోసం 17వ తేదీ బుధవారం డిపో తరఫున 52 షెడ్యూల్ బస్సులు, ఆరు ప్రత్యేక సర్వీసు బస్సులు నడిపినట్లు డీఎం పేర్కొన్నారు. వీటి ద్వారా నిర్దేశిత ఆక్యుపెన్సి రేషియో 76 కాగా, మైదుకూరు డిపో 99 శాతం సాధించినట్లు తెలిపారు. ఈపీకే 51.03తో రూ.12,64,321 ఆదాయం పొంది జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు డీఎం వివరించారు. ఇందుకు కారకులైన కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజీ సిబ్బంది, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ అధికారులకు డీఎం అభినందనలు తెలిపారు.

యునెస్కో గుర్తింపునకు సహకారం

కడప కల్చరల్: ప్రపంచ స్థాయి పర్యాటక ప్రదేశాల్లో ఒకటైన గండికోటకు యునెస్కో గుర్తింపు కోసం సహకరిస్తామని ఇంటాక్ కేంద్ర కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. న్యూఢిల్లీలోని ఇంటాక్ కేంద్ర కార్యాలయం నుంచి తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లోని జిల్లా చాప్టర్ల కన్వీనర్లతో జూమ్ యాప్ ద్వారా వార్షిక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లా చాప్టర్ అధ్యక్షుడు కె.చిన్నపరెడ్డి తమ కార్యక్రమాల డాక్యుమెంట్లు, ఛాయాచిత్రాలను అప్‌లోడ్ చేశారు.


రైతులకు శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానాధికారి రవీంద్రబాబు

సుండుపల్లె (రాజంపేట): మామిడి పూతకు ముందు, పూత, పిందె దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు శుక్రవారం ఉద్యానశాఖ, ఆర్‌హెచ్‌జీబీఎంఎస్ఎస్ (నాబార్డ్)సంయుక్తంగా సుండుపల్లి ఎంపీపీ స్కూల్‌లో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఉద్యాన అధికారి పి రవీంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మామిడిలో పూత రావడానికి, ఆడపూల శాతం పెరగడానికి పొటాషియం నైట్రేట్ (మల్టీకే)13.0.45ను 10 గ్రాములు, ఫార్ములా 4 లేదా ఆర్కా మ్యాంగో స్పెషల్ 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. కలికిరి ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త ఏ శ్రీనివాసులు మాట్లాడుతూ ఫ్రూట్ కవర్స్ వినియోగించడం వల్ల నాణ్యతతో కూడిన పండ్లను ఎగుమతి చేసుకుని అధిక లాభాలను పొందే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లె ఇన్‌చార్జి హెచ్‌ఓ జి సురేష్ బాబు, ఆర్‌హెచ్‌జీఎస్ఎస్ జనరల్ సెక్రటరీ బీవీ రత్నం, విఆగ్రో మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ జగదీష్, ఆర్‌బీకే సిబ్బంది, ఎఫ్‌పిఓ ప్రతినిధులు రమణ, చంద్ర నాయక్, రైతులు పాల్గొన్నారు.

గంగమ్మకు భారీగా వేలం ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ప్రత్యేక అధికారి రవీందర్‌రాజు

లక్కిరెడ్డిపల్లి: శ్రీ అనంతపురం గంగమ్మ ఆలయం వద్ద వివిధ వస్తువుల విక్రయ హక్కు కోసం నిర్వహించిన వేలం పాటల ద్వారా భారీగా ఆదాయం వచ్చింది. మార్చి 10, 11, 12వ తేదీల్లో జరిగే జాతర సందర్భంగా కొన్నింటికి, ఏడాది పాటు హక్కు కోసం మరికొన్నింటికి వేలం పాట నిర్వహించారు. గత నెల 26న నాలుగింటికి జరిగిన వేలం పాటలో రూ.21 లక్షల 34 వేల ఆదాయం వచ్చింది. రెండవ పర్యాయం శుక్రవారం నిర్వహించిన వేలం పాట ద్వారా రూ.12 లక్షల 91 వేల 500 ఆదాయం లభించింది. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ప్రత్యేక అధికారి రవీందర్‌రాజు మాట్లాడుతూ జాతరలో మూడు రోజుల పాటు టెంకాయలు అమ్ముకొనుటకు రూ.6 లక్షల 26 వేల 500, విడిదినాల్లో ఏడాది పాటు తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు రూ.4 లక్షలు, విడిదినాల్లో ఏడాది పాటు పూల విక్రయానికి రూ.1 లక్ష, 90 వేలు, ఏడాది పాటు తాత్కాలిక టోల్‌గేటుకు రూ.75 వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. మొత్తం వేలం పాటల ద్వారా రూ.34 లక్షల 25 వేల 500 వచ్చినట్లు వివరించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గంగమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని లెక్కించగా.. రూ.1 లక్ష, 86 వేల నగదు వచ్చింది. మొత్తం నగదును ఆలయ ఖాతాకు జమ చేసి జాతరకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాల పనులకు ఉపయోగించనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణ అధికారి జనార్దన్, సర్పంచ్ సామాల వెంకట నారాయణరెడ్డి, గంగమ్మ ఆలయ కమిటీ మెంబర్లు ఉడుము సుబ్బరాయుడు, ఉప్పుతోళ్ల సుబ్బయ్య, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజలసీమ

కరువుకు చిరునామాగా ఉన్న రాయలసీమ కృష్ణాజలాల రాకతో రాజలసీమగా మారనుంది. ఇక్కడి భూములను సస్యశ్యామం చేయాలనే సదుద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. శ్రీశైలంనుంచి కృష్ణా జలాలను తరలించి కర్షకుల కళ్లలో ఆనందం నింపింది. ఏళ్ల తరబడి చంద్రబాబు బూటకపు హామీలతో కుంగిపోయిన రైతాంగం కృష్ణమ్మ రాకతో హర్షం వ్యక్తం చేస్తోంది. హంద్రీ–నీవా కాలువ ద్వారా నీటి కష్టాలు తీర్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తోంది.

బిరబిరా కృష్ణమ్మ పరుగులు

- అసియా ఖండంలోనే క్లిష్టమైన సాగునీటి ప్రాజెక్టు
- గత టీడీపీ పాలనలో పడకేసిన కేజీసీ పనులు



బి.కొత్తకోట మండలం తరిగోడులో ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని కాలువలోకి ఎత్తిపోస్తున్న దృశ్యం

బి.కొత్తకోట: హంద్రీ–నీవా సాగు, తాగునీటి ప్రాజెక్టు నుంచి చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తరలించడమంటే అదో మహా యజ్ఞం. సముద్రమట్టానికి 758 మీటర్ల ఎత్తులోని ప్రాంతాలకు, 743 కిలోమీటర్ల దూరం నుంచి నీరు తరలించడం కోసం కాలువలపై 27 చోట్ల ఎత్తిపోతల పథకాలతో చేపట్టిన అతిక్లిష్టమైన ప్రాజెక్టు ఇది.ఇలాంటిది ఆసియా ఖండంలో మరొకటి లేదు. దీని ద్వారా ఉమ్మడి కర్నూలు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాకు ప్రయోజనం కలిగించాలన్నదే లక్ష్యం. ప్రాజెక్టుకు నీటి తరలింపు తొలిమెట్టు కర్నూలు జిల్లాలోని శ్రీశైలం ప్రాజెక్టు అయితే అంతం చిత్తూరుజిల్లా కుప్పం నియోజకవర్గం గుడిపల్లె మండలం పరమసముద్రం గ్రామశివారులోని పరమసముద్రం చెరువు. కరువుకు నిలయమైన రాయలసీమ ప్రాంతానికి శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను తరలించే హంద్రీ–నీవా ప్రాజెక్టు 1989లో పురుడుపోసుకుంది. 2005 వరకు ఎన్నికల ప్రాజెక్టుగా మిగిలియింది. మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో పనులు శరవేగంగా జరిగాయి. ఈ ప్రాజెక్టును రెండు దశలుగా చేపట్టారు. మొదటి దశలో కర్నూలు, అనంతపురం జిల్లాలు, రెండో దశలో ఉమ్మడి అనంతపురం, జిల్లాల్లో పనులు చేశారు. ఈ ప్రాజెక్టు కింద ప్రధాన, ఉపకాలువలు తవ్వించారు.

శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీ–నీవా ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా అనంతపురం జిల్లాలోని జీడిపల్లె రిజర్వాయర్‌కు, అక్కడినుంచి నేరుగా సత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్‌కు తరలిస్తారు. ఈ రిజర్వాయర్ నుంచి 400.5 కిలోమీటర్ వద్ద పుంగనూరు ఉపకాలువ ప్రారంభం అవుతుంది. సత్యసాయిజిల్లా నుంచి అన్నమయ్య జిల్లా దాటుకుని చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలం అప్పినపల్లె వరకు సాగుతుంది. ఇక్కడి నుంచి కుప్పం నియోజకవర్గం గుడిపల్లె మండలంలోని పరమసముద్రం చెరువు వరకు 123 కిలోమీటర్లు కుప్పం ఉపకాలువ సాగుతుంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి బుధవారం వర్దికుప్పం వరకు 672 కిలోమీటర్లు ప్రవహించాయి. ప్రధాన కాలువపై 8, పుంగనూరు ఉపకాలువపై 18, కుప్పం ఉపకాలువపై శంకరాయలపేట, పసుపుత్తూరు, ఆదినేపల్లె వద్ద 3 ఎత్తిపోతల పథకాల ద్వారా కుప్పం నియోజకవర్గంలోకి నీళ్లొచ్చాయి.

758 మీటర్ల ఎత్తు

శ్రీశైలం ప్రాజెక్టు వద్ద సముద్రమట్టానికి 240 మీటర్ల ఎత్తు ఉండగా అత్యధికంగా చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని పుగాలిమిట్ట వద్ద సముద్రమట్టానికి 758 మీటర్ల ఎత్తు ఉంది.ఎన్నో మలుపులు దాటుకుని, సరిహద్దులు చెరిపేస్తూ కుప్పంలో వినిపిస్తున్నాయి. హంద్రీనీవా ప్రాజెక్టు కర్నూలుజిల్లాలోని శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ప్రారంభమైతే చిత్తూరుజిల్లా కుప్పం నియోజకవర్గం గుడిపల్లె మండలంలోని పరమసముద్రం చెరువుతో ముగింపు. ప్రాజెక్టు ప్రధాన కాలువ శ్రీశైలం నుంచి ప్రారంభమై కర్నూలు, అనంతపురం, సత్యసాయిజిల్లాలో సాగుతుంది. కుప్పం నియోజకవర్గానికి నీటిని తరలించే పుంగనూరు ఉపకాలువ అన్నమయ్య, చిత్తూరుజిల్లాలో సాగి, చిత్తూరు జిల్లాలోని అప్పినపల్లె వద్ద కుప్పం ఉపకాలువతో మొదలై పరమసముద్రంలో ముగుస్తుంది. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి పరమసముద్రం వరకు 743.85 కిలోమీటర్లు కృష్ణాజలాలు ప్రవహించి కుప్పానికి చేరుకుంటాయి.

సొరంగాల తవ్వకం

హంద్రీనీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువపై మదనపల్లె వద్ద, కుప్పం ఉపకాలువపై పలమనేరు, బైరెడ్డిపల్లె మండలాల్లో, సత్యసాయిజిల్లా ఎన్‌పీ కుంట నుంచి తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యం మండలంలోకి ప్రవేశించే ప్రధాన కాలువ ముందుకు సాగడానికి కొండలు అడ్డంకి కావడంతో అక్కడ సొరంగాలు తవ్వించారు. మదనపల్లె వద్ద మూడు కిలోమీటర్ల సొరంగం, ఎన్‌పీ కుంట మండలంలోనూ పెద్ద సొరంగం నిర్మించారు. ఈ పనుల కోసం విదేశీ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించారు.

కాంట్రాక్టు సంస్థలకు రూ.144.7 కోట్లు దోచిపెట్టిన టీడీపీ సర్కార్

కుప్పం ఉపకాలువ పనిలో మరో రూ.287 కోట్లు దోచుకోవాలని పథకం వేశారు. అదనంగా మట్టి పనులు చేశామని కాంట్రాక్టు సంస్థ విన్నవించింది. రూ.160కోట్లు చెల్లించేలా అధికారులు చేసిన ప్రతిపాదనను స్టేట్‌లెవల్ స్టాండింగ్ కమిటీ అదనపు చెల్లింపు కదరదని స్పష్టం చేసింది. ఈ వ్యవహారం మంత్రిమండలికి చేరి నిర్ణయం తీసుకునేలా చేసింది. కాంక్రీటు నిర్మాణాలకు మాత్రమే అదనం చెల్లిస్తామని ఎస్ఎల్ఎస్‌సీ నిర్ణయం తీసుకోగా రూ.122.75 కోట్లు మంజూరు చేస్తూ 2018 సెప్టెంబర్ 7 జీవో నంబర్ 626 జారీ చేసింది. కాలువ గట్ల మీద మట్టిపనులు చేశారని ప్రభుత్వం 2019 జనవరి 28న జీవో 68 జారీచేసి రూ.21.95 కోట్లు అదనంగా మంజూరు చేసింది. దీంతో గత టీడీపీ సర్కార్ కాంట్రాక్టు సంస్థలకు అదనం రూ.144.7 కోట్లు దోచిపెట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా జీవో నంబర్ 32 తీసుకొచ్చింది. దీంతో కుప్పం కాలువ పని విలువ రూ.574.96 కోట్లకు చేరింది.

మాట నిలబెట్టుకున్న జగనన్న

కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలను తరలించే ప్రణాళికకు 2005లోనే దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆమోదం తెలిపారు. 2015లో కుప్పం ఉపకాలువ పనులకు గత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే దోచుకోవడానికి చూపిన ప్రాధాన్యత పనులపై చూపలేదు. దీంతో ఎక్కడిపనులు అక్కడే ఆగిపోయాయి. అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తరలించేందుకు చిత్తశుద్ధితో పనిచేసింది. జలవనరులశాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ నారాయణరెడ్డి, ఎస్ఈ రాజగోపాల్ సీఎం నిర్ణయం అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో పనిచేశారు. పనులు సత్వరమే పూర్తి చేయించేలా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలు కృషి చేశారు. 2022లో కుప్పంలో పర్యటించిన సీఎం వైఎస్.జగన్ ఇచ్చిన మాట మేరకు పనులు పూర్తి కావడంతో కృష్ణాజలాలు తరలి వస్తున్నాయి.

నేటి నుంచి కుల గణన



కడప సెవెన్‌రోడ్స్: అన్ని వర్గాల ప్రజల సామాజిక, ఆర్థిక,విద్య, జీవనోపాధి తదితర అంశాలకు సంబంధించిన సమగ్ర కుల ఆధారిత సమాచార సేకరణ నిమిత్తం శుక్రవారం నుంచి జిల్లాలో కుల గణన కార్యక్రమం చేపడుతున్నామని వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో సిబ్బంది, వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి కులగణనకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తారని చెప్పారు. మిగిలిపోయిన కుటుంబాలను అంటే సర్వే సమయంలో అందుబాటులో లేని వారి గణనను ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు సేకరిస్తామన్నారు. సర్వే జరుగుతున్నప్పుడు సమస్యలను తక్షణమే పురిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ఎస్సీ, బీసీ, గిరిజనసంక్షేమ శాఖల వద్ద సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించామని తెలిపారు. సర్వే ద్వారా సేకరించిన డేటాను అట్టడుగు వర్గాల ప్రయోజనాలు, మెరుగైన ప్రణాళికల రూపకల్పన కోసం మాత్రమే వినియోగిస్తామన్నారు. ఈ డేటాను ఉపయోగించి ప్రస్తుతం అమలులో ఉన్న సంక్షేమ పథకాలను తొలగించడం లేదా కొత్తగా ఇవ్వడం జరగదని స్పష్టం చేశారు. కుల ధృవీకరణ పత్రాల జారీ కోసం కూడా ఈ డేటాను ఉపయోగించబోమని చెప్పారు. ఈ సర్వే ద్వారా జనాభా, విద్య, ఆర్థిక, సామాజిక వివరాలను మాత్రమే సేకరిస్తామన్నారు. వ్యక్తిగత వివరాలు ఎవరికీ వెల్లడించబోమన్నారు. డేటా భద్రత, గోప్యత చర్యలు చేపడతామని వివరించారు. కుల గణన కోసం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇళ్ల వద్దకు వచ్చినపుడు ప్రజలు సహకరించాలని కోరారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
- లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ జమ
- జిల్లాలో 23433 మందికి రూ. 2,53,53,229 లబ్ధి



మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తదితరులు

రాయచోటి: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేశారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, హౌసింగ్ పీడీ శివయ్య, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, హౌసింగ్ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల కింద జిల్లాలో 23433 మందికి రూ. 2,53,53, 299లు వడ్డీ రీయింబర్స్‌మెంట్ అందించినట్లు చెప్పారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం వివిధ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఇళ్లు మంజూరైన ప్రతి ఒక్కరూ త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే రూ. 35 వేలు రుణం తీసుకొని ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించిన వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం జేసీ, హౌసింగ్, డీఆర్‌డీఏ శాఖల అధికారుల చేతుల మీదుగా మెగా చెక్కును లబ్ధి దారులకు అందజేశారు.

రీ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

జిల్లాలో జరుగుతున్న మూడో విడత రీ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులకు సూచించారు. గురువారం విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి మూడో దశ రీసర్వే, స్త్రీ శిశు సంక్షేమం, అంగన్‌వాడీల పనితీరు, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాయచోటిలోని కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీసర్వే చేపట్టిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపుల ద్వారా ప్రజలకు ఉచితంగా వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించి మందులు అందజేస్తోందన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా చిన్నారులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందజేయాలని, సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు.

విశ్వ నాయకుడు అంబేడ్కర్

- 206 అడుగుల విగ్రహావిష్కరణ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుంది
- ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషా



మారథాన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: భారత రత్న డా. బీఆర్ అంబేడ్కర్ విశ్వ నాయకుడని, ఆయన 206 అడుగుల విగ్రహావిష్కరణ ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. ఈనెల 19వ తేదీన 206 అడుగుల ఎత్తు ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయవాడలో ఆవిష్కరించనున్న సందర్భంగా గురువారం కడప ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఏర్పాటు చేసిన ర్యాలీని ఆయన జాయింట్ కలెక్టర్ జి. గణేష్ కుమార్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సామాజిక సమతా సంకల్పం మహోత్సవాల్లో భాగంగా మారథాన్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ కూడలి నుంచి మొదలైన ఈ ర్యాలీ పటేల్ రోడ్డు, రాజీవ్ మార్గ్, ఎల్ఐసీ సర్కిల్, మహావీర్ సర్కిల్ మీదుగా కలెక్టర్ కార్యాలయానికి చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ గొప్ప మేధావి అని, ప్రపంచ దేశాల్లో అతిపెద్ద లిఖిత పూరిత రాజ్యాంగాన్ని దేశానికి అందించారన్నారు. దళిత, బడుగు, బలహీన వర్గాలకు సమాన అవకాశాలు, హక్కులు కల్పించారన్నారు. ఆ మహనీయుని గొప్పదనాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గుర్తించి ఆయనను భవిష్యత్ తరాలు కీర్తించేలా 206 అడుగుల విగ్రహం, స్మృతి వనం, గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ జేడీ సరస్వతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకట సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయక్, కె. బాబు, చెన్నయ్య, బండి ప్రసాద్, త్యాగరాజు, బాలస్వామిరెడ్డి,ఎం. సుబ్బారెడ్డి, జాషువా, సంపత్, మియ్యా, కంచుపాటి బాబు, బండి మరియలు, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

పదికి ప్రత్యేక ప్రణాళిక

- పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనపై దృష్టి
- ప్రతి రోజూ స్టడీ అవర్స్
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా చర్యలు



స్టడీ అవర్స్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

పరీక్షలు రాసే విద్యార్థులు : 22,439 మంది

సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు: 3,078

పరీక్షా కేంద్రాలు: 129

మదనపల్లె సిటీ: పదో తరగతి 2022–23 విద్యా సంవత్సరం ఫలితాల్లో అన్నమయ్య జిల్లా రాష్ట్రస్థాయిలో 15వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది ఇంకా మెరుగైనా ఫలితాల సాధన కోసం విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. 48 రోజుల ప్రణాళికను రూపొందించి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజూ స్టడీ అవర్స్, ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉన్నత పాఠశాలల్లో 22,439 మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో 2022–23 సంవత్సరంలో 22,219 మంది పరీక్షలు రాయగా 16,009 మంది ఉత్తీర్ణులయ్యారు. 72.05 శాతం ఉత్తీర్ణ సాధించింది. 2023–24 విద్యా సంవత్సరం ఫలితాల్లో మరోసారి మంచి ర్యాంకు సాధించడానికి చర్యలు చేపట్టారు. గత ఏడాది డిసెంబర్ నుంచి 48 రోజుల ప్రత్యేక ప్రణాళికను ప్రారంభించారు. ప్రతి రోజు సంబంధిత సబెక్టులో సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల వరకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు సబ్జెక్టు చెప్పటంతో పాటు వారి అనుమానాలు నివృత్తి చేస్తున్నారు. ఇందుకు సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయుడు కూడా స్టడీ అవర్‌లో ఉండటం వారికి చక్కగా ఉపయోగపడుతోంది. చాప్టర్స్ వారీగా సంబంధిత సబ్జెక్టులో పరీక్షలు కూడా నిర్వహించి విద్యార్థుల ప్రతిభకు ప్రోత్సాహం అందిస్తున్నారు. నిర్దేశించిన తేదీ కంటే ముందుగా సిలబస్ పూర్తి చేశారు. ఒక వైపు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు నిరంతర పర్యవేక్షణలో సబ్జెక్టు ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

విద్యార్థులకు ఒత్తిడి ఉండదు



పరీక్షలు అనగానే విద్యార్థులు కొంత ఒత్తిడికి లోనవుతారు. అందువల్ల ముందుగానే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. వెనుబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఈ ఏడాది జిల్లాలో మంచి ర్యాంకు సాధించడానికి ప్రయత్నిస్తున్నాం. –శ్రీరాం పురుషోత్తం, డీఈఓ, అన్నమయ్య జిల్లా

ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నాం



పదో తరగతి విద్యార్థులను పరీక్షల తయారీకి ప్రత్యేక ప్రణాళిక ప్రకారం తర్ఫీదు ఇస్తున్నాం. విద్యార్థులు అంతర్గత పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా వారిని గ్రేడ్‌లుగా విభజించి ప్రత్యేక శ్రద్ధవహిస్తున్నాం. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకుంటున్నారు. –సుబ్బారెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీహెచ్ఎస్,మదనపల్లె

విద్యార్థుల అభ్యున్నతికి కృషి



విద్యార్థులకు ప్రత్యేక తరగతులు తీసుకుని ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. ప్రభుత్వం 48 రోజుల ప్రణాళిక తయారు చేసి ఇచ్చింది. విద్యార్థులకు పరీక్షలు పెడుతూ సామర్థ్యాలను మెరుగుపరుస్తున్నాం. –షాజహాన్, హెచ్‌ఎం, ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాల, మదనపల్లె

స్టడీ అవర్స్‌తో ఉపయోగం



ప్రతి రోజు ప్రత్యేక స్టడీ అవర్స్ బాగా ఉపయోగపడుతున్నాయి. తరగతిలో నేర్చుకున్న విషయాలను మళ్లీ రివిజన్ చేసుకుంటున్నాం. ఉపాధ్యాయులు తమ సబ్జెక్టులో సందేహాలు తీరుస్తున్నారు. మంచి మార్కులు తెచ్చుకుంటాను. –నామ ధీరజ్, పదో తరగతి విద్యార్థి, జెడ్పీహెచ్ఎస్

కళాశాలను సందర్శించిన 'కోటిరెడ్డి' వారసులు



వైవీయూ: కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటై 50 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా స్థలదాతలైన కడప కోటిరెడ్డి, రామసుబ్బమ్మల వారసులను కళాశాలకు ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో గురువారం అశోక్‌కుమార్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, వివేకానందరెడ్డి, సుదేష్, మనుమరాళ్లు స్వర్ణ, రమ్య, మునిమనుమరాలు శాన్విలు కళాశాలను సందర్శించారు. కోటిరెడ్డి కుమారుడు జయభారత్‌రెడ్డి ఇచ్చిన రూ.1 కోటి విరాళంతో ఏర్పాటు చేసిన వసతిగృహాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్ నిర్వహణకు పెరుగుతున్న ఖర్చును భరించేందుకు అంగీకరించారు. కళాశాలలో కోటిరెడ్డి, రామసుబ్బమ్మల కాంస్య విగ్రహాల ఏర్పాటుకు స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా కళాశాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను వారి దృష్టికి తీసుకెళ్లగా చేయూతనిస్తామని సమ్మతించారు.

క్లుప్తంగా

ఏడుగురు కోడిపందెం రాయుళ్ల అరెస్టు

రామసముద్రం : రామసముద్రం మండలం చెంబకూరు సమీపంలో కోడిపందెలు ఆడుతున్న ఏడుగురిని గురువారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. కోడిపందెలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలసి దాడి చేయగా ఆర్.నడింపల్లి పంచాయతీ దిగువబోంపల్లి గ్రామానికి చెందిన శివ, ముంజునాథ్, లోకేశ్వర్‌నాయుడు, గుట్టపాళ్యెం హరీష్, మచ్చువారిపల్లెకి చెందిన కృష్ణప్పలు కోడి పందెలు ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.4060 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన సుబ్బిరెడ్డి

రామసముద్రం : దాడిలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన రామసముద్రం మండలంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మాలేనత్తం పంచాయతీ కురప్పనపల్లి గ్రామానికి సుబ్బిరెడ్డి ఆవులు తోలుకుని వెళ్తుండగా అదే గ్రామానికి చెందిన కొంత మంది దాడి చేయడంతో సుబ్బిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే గాయపడిన వ్యక్తిని పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇద్దరు యువతుల ఆత్మహత్యాయత్నం

మదనపల్లె సిటీ : కుటుంబ సమస్యల కారణంగా ఇద్దరు యువతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం జరిగింది. మదనపల్లె మండలం చిప్పిలికి చెందిన గురుమూర్తి భార్య స్వప్న(26) నిద్రమాత్రలు మిగింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. గుర్రంకొండ మండలం మామిళ్లవారిపల్లెకు చెందిన రెడ్డిరాణి (22) కుటుంబ సమస్యల కారణంగా విషద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జింకలు అడ్డు రావడంతో ఆటోలు బోల్తా

పెద్దతిప్పసముద్రం : జింకలు అడ్డు రావడంతో రెండు ఆటోలు బోల్తా పడిన సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి.మండలంలోని తుమ్మరకుంట సమీపంలో, అలాగే పులికల్లు పంచాయతీ బొంతలవారిపల్లి సమీపంలో గురువారం వేర్వేరుగా ప్రయాణికులతో వెళుతున్న రెండు ఆటోలు జింకలు అడ్డుగా రావడంతో బోల్తా పడ్డాయి. ఈ రెండు ప్రమాద ఘటనల్లో 9 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

వేమా.. వందనం!

యోగివేమనా నీకు వందనం.. విశ్వకవి తాత్వికా నీకు వందనం.. అన్న ఉద్దీపన గీతంతో ఉత్తేజితులవుతూ.. సామాజిక స్పృహ కల్పించిన ప్రజాకవి పేరుతో ఏర్పాటైన యోగివేమన విశ్వవిద్యాలయంలో ఇప్పటి వరకు ఆయన జయంతి వేడుకలు నిర్వహిస్తూ రాగా.. రాష్ట్ర ప్రభుత్వం వేమన జయంతిని ప్రతియేటా జనవరి 19న రాష్ట్ర వేడుకగా నిర్వహించాలంటూ ఉత్తర్వులు జారీ చేసి సముచిత గౌరవం కల్పించింది.

- నేడు యోగి వేమన జయంతి వేడుకలు
- వేమన చైతన్యర్యాలీ, పద్యగానం


వైవీయూ ముఖద్వారం వద్ద ఉన్న వేమన విగ్రహం

వైవీయూ : విశ్వదాభిరామ.. వినురవేమ.. అనేమాట వినని తెలుగువారు ఉండరు.. 'వానకు తడవని వారు, ఒక వేమన పద్యం కూడా రాని తెలుగువారు ఉండరు' అని లోకోక్తి. ఆ మహాకవికి రాష్ట్ర ప్రభుత్వం సముచిత గౌరవం కల్పించింది. యోగివేమన జయంతిని రాష్ట్ర వేడుకగా ప్రతి సంవత్సరం జనవరి 19న అధికారికంగా నిర్వహించాలని గత ఏడాది జీఓ నంబర్ 164ను విడుదల చేసింది. దీంతో ప్రతియేటా జనవరి 19న వేమన జయంతి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేందుకు మార్గం సుగమమైంది.

ప్రజాకవి, తత్వవేత్త అయిన వేమన పేరుతో దేశంలో ఏర్పాటైన ఏకైక విశ్వవిద్యాలయం యోగివేమన విశ్వవిద్యాలయం. 2006లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ఏర్పాటైన ఈ విశ్వవిద్యాలయంలో 2014లో వేమన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి కొద్ది సంవత్సరాల పాటు జనవరి 18వ తేదీన వేమన జయంతి వేడుకలు నిర్వహిస్తూ వచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జనవరి 19న రాష్ట్రవేడుకగా వేమన జయంతిని నిర్వహించేందుకు విశ్వవిద్యాలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. అతిథులకు సైతం వేమన పద్యాలను జ్ఞాపికల రూపంలో అందజేస్తూ సరికొత్త సంప్రదాయానికి విశ్వవిద్యాలయ అధికారులు శ్రీకారం చుట్టారు.

ప్రాంగణంలో వేమన పద్యాలు..

వేమన పద్యాలు ఎంత సరళంగా స్పష్టంగా, అర్థవంతంగా ఉంటాయో.. ఆ పద్యాలకు ఉన్న ఆదరణే తెలియజేస్తుంది. అయితే వేమన పేరుతో ఏర్పాటైన విశ్వవిద్యాలయంలో ఆయన నోటి నుంచి జాలువారిన పద్యాలను ఎంపిక చేసుకుని విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయంలో 'వేమన మాట' పేరుతో వేమన పద్యాలను రాసి క్యాంపస్‌లో పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. అదే విధంగా ముఖ్య అధికారుల కార్యాలయాల్లో సైతం వేమన పద్యాలను ఏర్పాటు చేశారు.

నేడు వైవీయూలో వేమన జయంతి ఉత్సవం

యోగివేమన విశ్వవిద్యాలయంలో శుక్రవారం వేమన జయంతి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలుగుశాఖ విభాగాధిపతి ఆచార్య బి. పార్వతి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. వైవీయూ పరిపాలన భవనం నుంచి వేమన చైతన్య ర్యాలీ, పద్యగానం కార్యక్రమాలు, వేమన విగ్రహానికి పుష్పమాల అలంకరణ ఉంటాయని తెలిపారు.

నవశకం

పైసా ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు వచ్చాయి



కుల, ఆదాయ సర్టిఫికెట్ల కోసం మా గ్రామ వలంటీర్ వచ్చి నాకు సంబంధించిన ఆధార్‌కార్డు, రేషన్ కార్డు తీసుకెళ్లారు. మా గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో నాకు కుల, ఆదాయ సర్టిఫికెట్లకు సంబంధించి పైసా ఖర్చు లేకుండానే అందజేశారు. ఈ సర్టిఫికెట్ల కోసం గతంలో రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగాను. మా వలంటీర్ వచ్చి నాకు శ్రమ లేకుండానే సర్టిఫికెట్లను చేయించారు. నేను చాలా సంతోషపడ్డాను. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం పెట్టడం ద్వారా సర్టిఫికెట్లను ఎవరైనా ఉచితంగా పొందవచ్చనే నమ్మకం కలిగింది. – నల్లు వసంతలక్ష్మి, ఉప్పురపల్లి గ్రామం, సిద్దవటం మండలం

సొంతింటి కల నెరవేరింది



పక్కా గృహం కట్టుకునే ఆర్థిక స్థోమత లేక గుడిసెలో జీవనం సాగిస్తుండేవాళ్లం. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడంతో మాకు ప్రభుత్వం పక్కా గృహం మంజూరు చేసింది. దీనికి మా కష్టం తోడుచేసి పక్కా గృహం కట్టుకొని హాయిగా జీవిస్తున్నాము. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాము. – పి.శారద, ఎం.గొల్లపల్లి, మైలపల్లి పంచాయతీ, చిట్వేలి, అన్నమయ్య జిల్లా.

మారిన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు



ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు గతంతో పోలిస్తే ఎంతో మారిపోయాయి. చరిత్రలో కూడా చూడలేని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారు. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపడ్డాయి. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా నాడు–నేడు కింద అధునాతనంగా మారిన పాఠశాలల భవనాలను చూసి ఆనందిస్తున్నారు. – పి.మన్సూర్ అలీఖాన్, హెడ్‌టీచర్, ఎంపీపీఎస్ ఉర్దూ స్కూల్, బోనమల, చిన్నమండెం మండలం

గాయపడిన ఉపాధ్యాయుడి మృతి

- నాడు కరోనాతో భార్య.. నేడు రోడ్డు ప్రమాదంలో భర్త మరణం
- అనాథలుగా మారిన పిల్లలు


చుక్కా శ్రీనివాసులు (ఫైల్)

కురబలకోట/మదనపల్లె సిటీ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని అంగళ్లు జెడ్పీ హైస్కూల్ తెలుగు టీచర్ చుక్కా శ్రీనివాసులు బుధవారం రాత్రి మృతి చెందారు. వ్యక్తిగత పనిపై కుమారునితో కలసి తిరుపతి నుంచి మోటార్ బైకుపై వస్తూ సీటీఎం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. గురువారం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని స్వగ్రామం కురబలకోటలోని పగడాలపల్లె దగ్గరున్న గుట్టకింద కాలనీకి తరలించారు. శుక్రవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈయనకు తెలుగు పండిట్‌గా మంచి పేరుంది. ఇతనికి ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె జాహ్నవికి వివాహం కాగా వైష్ణవి ఫిలిఫ్ఫెన్స్‌లో ఎంబీబీఎస్ చదువుతోంది. కుమారుడు బిపిన్ సాయితేజ ఇంటర్ చదువుతున్నాడు. పిల్లలు ఎదుగుతున్న సమయంలో కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ఈయన ఆకస్మికంగా మృతి చెందడంతో బంధుమిత్రులతో పాటు స్థానిక ఎంఈఓ ద్వార కనాథ్, సహచర టీచర్లు, విద్యార్థులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇదివరలో వెలుగు ఏపీఎంగా పనిచేస్తున్న ఇతని భార్య రేణుక కరోనాతో మృతి చెందారు. ఇప్పుడు టీచర్ శ్రీనివాసులు కూడా మృతి చెందడంతో పిల్లలు తల్లిదండ్రుల ప్రేమకు దూరమయ్యారు. దేవుడా ఇక మాకెవరు దిక్కు.. మమ్మల్ని ఎవరు చూస్తారు..మంచి చెడులు చెప్పేవారు ఎవరు.. అమ్మా నాన్నలు ఒకరి తర్వాత ఒకరు దూరమయ్యారు.. బతుకు బాటలో ఇక మమ్మల్ని ముందుకు ఎవరు నడిపిస్తారు డాడీ అంటూ మృతదేహంపై పడి గుండెలవిసేలా బోరున విలపించడం చూసి చెమ్మగిల్లని కళ్లు లేవు.

కుళ్లుతున్న వరి నాట్లు.. రైతులకు తప్పని పాట్లు



ఇక్కడ కుళ్లిపోయిన వరి నాట్లను చూపుతున్న రైతు పేరు వెలుగు రమణారెడ్డి. చాపాడు మండలం నక్కలదిన్నె గ్రామానికి చెందిన ఈ రైతు రెండో కారు కింద 5 ఎకరాల్లో వరి నాట్లు వేశాడు. రెండు వారాల వరకూ బాగానే ఉన్న వరి పైరు మూడో వారం నుంచి ఎండిపోతోంది. ఐదు ఎకరాల్లో వరి నాట్లు చచ్చిపోయి పూర్తిగా కుళ్లిపోయాయని, ఏ కారణం చేత ఇలా అవుతోందో తెలియడం లేదంటున్నాడు. మొదటి కారులో వరి పైరు దిగుబడులు బాగా రావడంతో రెండో కారుపై దృష్టి సారిస్తే ఇలా నష్టపోయానని రైతు వాపోతున్నాడు.

- నక్కలదిన్నె పంచాయతీలో 200 ఎకరాల్లో దెబ్బతిన్న వరి పైర్లు
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బాధిత రైతులు

చాపాడు : మండలంలోని నక్కలదిన్నె, ఎన్.ఓ బాయపల్లె గ్రామాలలో రెండో కారులో రైతులు సాగు చేసుకున్న వరి పైర్లు నిలువునా దెబ్బతింటున్నాయి. పైరు సాగు చేసిన రెండు వారాల నుంచే నాటిన వరి నాట్లు నాటినట్లే నిలువునా చచ్చిపోయి కుళ్లిపోతున్నాయి. మొదటి కారులో మంచి దిగుబడులు ఇచ్చిన ఇదే భూమిలో రెండు కారులో సాగు చేసిన వరి పైర్లు మూడు వారాల్లోపే పైరు మొత్తం చచ్చిపోతోందని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. జై శ్రీరామ్ రకం వరి రెండో కారులో ఎండలను తట్టుకుని బాగా పండుతుందని వరి సాగు చేసినట్లు రైతులు చెబుతున్నారు. వెలుగు రమణారెడ్డి-5 ఎకరాలు, శేఖర్‌రెడ్డి-3 ఎకరాలు, ఏటూరు జకరయ్య-10 ఎకరాలు, శెట్టిపల్లె మల్లికార్జునరెడ్డి-5 ఎకరాలు, సాంబశివారెడ్డి-3 ఎకరాలు ఇలా 50 మంది రైతులకు చెందిన 200 ఎకరాల్లో సాగు చేసిన వరి పైర్లు పూర్తి దెబ్బతిన్నాయి. ఇప్పటికే పలువురు రైతులు పొలాలను దున్నేయగా మరికొంతమంది రైతులు పంట దెబ్బతినడంతో చింతిస్తున్నారు. వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వం నుంచి తమను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు వాపోతున్నారు. పంటకు వైరస్ సోకిందని, భూమిలో వేడి ఎక్కువ అయిందని ఇలా అనేక విధాలుగా బాధిత రైతులు చర్చించుకుంటున్నారు.

వ్యవసాయాధికారి ఏమన్నారంటే..

మండలంలోని నక్కలదిన్నె పంచాయతీలో రెండో కారులో సాగైన వరి పైర్లు దెబ్బతినడంపై మండల వ్యవసాయాధికారి మ్యాగిని వివరణ కోరగా.. పంట పొలాలను పరిశీలించి దెబ్బతినేందుకు కారణాలను తెలుసుకుని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

– ఇద్దరికి గాయాలు



వీరబల్లి (రాయచోటి టౌన్) : రోడ్డు పక్కన ఉన్న చెట్టును కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం రాత్రి వీరబల్లె నుంచి రాయచోటికి వెళ్లే దారిలో సంఘంవాండ్లపల్లె సమీపానికి రాగానే కారు డ్రైవర్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టుకు ఢీకొట్టాడు. ఈ సంఘటనలో కృపావతి, మరో మహిళకు గాయాలయ్యాయి. వీరు రాయచోటిలో సమీప బంధువుల వివాహానికి వెళ్లి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వీరిని వెంటనే స్థానికుల సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరులోని కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఇరువర్గాల ఘర్షణ

మదనపల్లె సిటీ : వేరుశనగ పంట ఆవు మేసిన సంఘటనలో ఇరు వర్గాలు దాడులకు పాల్పడిన సంఘటన మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ మిట్టపల్లెలో గురువారం జరిగింది. మిట్టపల్లెకు చెందిన రామాంజులు వేరుశనగ పంట సాగు చేశాడు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన వెంకటరమణకు చెందిన ఆవు వెళ్లి వేరుశనగ పంటను మేసింది. ఇది గమనించిన రామాంజులు ఆవు యజమానిని నిలదీశాడు. దీంతో ఇరు వర్గాలు దాడులకు దిగారు. ఈ దాడుల్లో రామాంజులు (40) గాయపడగా, మరో వర్గానికి చెందిన వెంకటరమణ భార్య ఉమా (29) గాయపడింది. ఇరువురు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వాహనాల తనిఖీల్లో రూ.9 లక్షలు స్వాధీనం

బద్వేలు అర్బన్ : బద్వేలు – మైదుకూరు రహదారిలోని చెన్నంపల్లె సమీపంలో గల భారత్ పెట్రోల్ బంక్ వద్ద అర్బన్ పోలీసులు గురువారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.9 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఇందుకు సంబంధించిన వివరాలను అర్బన్ సీఐ పి.యుగంధర్ తెలిపారు. మైదుకూరు మండలం తువ్వపల్లె గ్రామానికి చెందిన కంచర్ల విజయభాస్కర్ ఏపీ04బీఎం 6803 నంబరు గల కారులో బద్వేలు నుంచి మైదుకూరుకు వెళుతుండగా కారును ఆపి తనిఖీ చేశామన్నారు. అందులోని బ్యాగులో రూ.9 లక్షల నగదును గుర్తించి నగదుకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నగదును ఐటీ అధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు నిరసన

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం బకాయిల చెల్లింపులో చేస్తున్న అలసత్వాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ పిలుపు మేరకు ఈ నెల 19వ తేదీన కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా తెలిపారు.

తగ్గని చలిగింతలు

- రాత్రుల్లో తగ్గిన ఉష్ణోగ్రతలు.. కొనసాగుతున్న చలి తీవ్రత
- కనిష్టంగా 18.1 డిగ్రీలు
- తెల్లవారుజామున కమ్ముకుంటున్న పొగమంచు
- చలితో వణుకుతున్న ప్రజలు

కడప అగ్రికల్చర్ : నిన్న మొన్నటి వరకు చుర్రుమనే ఎండలు. చాలా సందర్భాల్లో వేసవిని తలపించే ఉక్కబోత. నవంబర్ నెలాఖరులో కూడా ఇదే వాతావరణం. డిసెంబర్ 10వ తేదీ తరువాత శీతలం మొదలైంది. దీనికి తోడు మిచాంగ్ తుపాను జత కలవడంతో వాతావరణంలో మార్పు చోటు చేసుకుని చలికాస్త పెరిగింది. రానురాను చలి తీవ్రత పెరిగి ఇంకా చలి పంజా విసురుతోంది. రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలి తీవ్రత పెరిగింది. తెల్లవారుజామునుంచే పొగమంచు కురవడం ప్రారంభమై ఉదయం 7 గంటల వరకు పొగమంచు దట్టంగానే ఉంటోంది. ఈ పొగమంచుతో జాతీయ రహదారుల వెంబడి వెళ్లే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనైతే ఉషోదయాన్నే మంచు దుప్పటి కప్పేస్తోంది. దీంతో గ్రామీణ ప్రజలు చలికి వణికిపోతున్నారు. సంక్రాంతి పండుగ ముగిసినా చలి తీవ్రత కొనసాగుతూనే ఉంది. తెల్లవారుజామునుంచే గ్రామాల్లో చలిమంటలు వేసుకుంటూ శీతలాన్ని తగ్గించుకుంటున్నారు.

తగ్గిన ఉష్ణోగ్రతలు..

వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా నవంబర్ నెల చివరి వారంలో కూడా గరిష్ట ఉష్ణోగ్రత 31.2 డిగ్రీలు ఉండగా కనిష్ట ఉష్ణోగ్రత 23 డిగ్రీలు ఉండేది. డిసెంబర్ మొదటి వారంలో కూడా గరిష్ట ఉష్ణోగ్రత 31.5 డిగ్రీలు ఉండగా కనిష్ట ఉష్ణోగ్రత 23.6 ఉండేది. డిసెంబర్ 15వ తేదీ నాటికి గరిష్ట ఉష్ణోగ్రత 28.3 ఉండగా కనిష్ట ఉష్ణోగ్రత 19.4కు చేరుకుంది. దీంతో జిల్లాలో చలి ప్రారంభమైంది. డిసెంబర్ 20వ తేదీకి గరిష్ట ఉష్ణోగ్రత 29.9 డిగ్రీలకు చేరుకోగా కనిష్ట ఉష్ణోగ్రత 18.7కు చేరుకుంది. అలాగే డిసెంబర్ 24వ తేదీ గరిష్ట ఉష్ణోగ్రత 28.7 ఉండగా కనిష్ట ఉష్ణోగ్రత 16.7 డిగ్రీలకు చేరుకుంది. దీంతో మరింత చలితీవ్రత పెరిగింది. డిసెంబర్ 27వ తేదీ గరిష్ట ఉష్ణోగ్రత 29.9 డిగ్రీలు కాగా కనిష్ట ఉష్ణోగ్రత 18.4కు చేరింది. డిసెంబర్ 29వ తేదీ గరిష్ట ఉష్ణోగ్రత 30.3 ఉండగా కనిష్ట ఉష్ణోగ్రత 17.1, 30వ తేదీ గరిష్టం 30.3 కాగా కనిష్టం 18.9, 31వ తేదీ గరిష్టం 30.5 కాగా కనిష్టం 18.7గా నమోదైంది.

జనవరి నెలలో..

జనవరి 1వ తేదీ గరిష్టం 30.2 డిగ్రీలు కాగా కనిష్ట ఉష్ణోగ్రత 18.3 డిగ్రీలు. 2వ తేదీ గరిష్టం 30.7 కాగా కనిష్టం 20.2 డిగ్రీలు, 3వ తేదీ గరిష్టం 29.5 కాగా కనిష్టం 21.3 డిగ్రీలు, 4వ తేదీ గరిష్టం 29.6 కాగా కనిష్టం 22.2, 5వ తేదీ గరిష్టం 30.7 కాగా కనిష్టం 21.5, 6వ తేదీ గరిష్టం 30.9 కాగా కనిష్టం 20.9, 7వ తేదీ గరిష్టం 20.0 కాగా కనిష్టం 20.2, 8వ తేదీ గరిష్టం 30.0 కాగా కనిష్టం 23.2, 9వ తేదీ గరిష్టం 26.8 కాగా కనిష్టం 22.5, 10వ తేదీ గరిష్టం 30.5 కాగా కనిష్టం 21.1, 11వ తేదీ గరిష్టం 30.7 కాగా కనిష్టం 20.6, 12వ తేదీ గరిష్టం 31.4 కాగా కనిష్టం 18.1, 13వ తేదీ గరిష్టం 32.4 కాగా కనిష్టం 20.2, 14వ తేదీ గరిష్టం 33.2 కాగా కనిష్టం 19.3, 15వ తేదీ గరిష్టం 30.2 కనిష్టం 19.3, 16వ తేదీ గరిష్టం 32.2 కనిష్టం 20.4, 17వ తేదీ గరిష్టం 31.2 కాగా కనిష్టం 18.2 డిగ్రీలుగా నమోదైంది.

ఆదరణ కోల్పోని చెక్కభజనలు

- ఏ జాతరలో చూసినా దర్శనమిస్తున్న చెక్కభజనలు
- ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలంటున్న కళాకారులు


చెక్కభజన కార్యక్రమంలో కళాకారులు(ఫైల్)

పులివెందుల రూరల్ : సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రాచీన కాలం నుంచి వస్తున్న చెక్కభజనలు ఆదరణ కోల్పోకుండా వస్తున్నాయి. నేటి కంప్యూటర్ యుగంలో కూడా పండుగలు, పర్వదినాలు, తిరుణాలలో, చల్లముద్ద వేడుకలు లాంటి కార్యక్రమాలలో గ్రామీణ ప్రాంతాల్లో ఈ చెక్కభన కార్యక్రమాలు కనిపిస్తూనే వున్నాయి. గజ్జెపూజ వంటి చెక్కభజనలు నేటికీ దర్శనమిస్తున్నాయి. ఎంతో ప్రాచీనకాలం నాటి చెక్కభజన గతంలో ఆదరణ కోల్పోయినా ప్రస్తుత కాలంలో వీటికి పూర్వ వైభవం లభిస్తోంది. గ్రామీణ ప్రాంతంలో చెక్కభజన గురువులను పిలిపించుకుని చెక్కభజన నేర్చుకుంటున్నారు. గజ్జెపూజకు చుట్టుపక్కల బంధుమిత్రులను పిలిపించుకుని గ్రామీణ ప్రాంతాలలో చెక్కభజన కార్యక్రమాన్ని ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. పండుగలు, పర్వదినాలు కాకుండా తీరిక దొరికిన సమయంలో గ్రామీణ ప్రాంతాలలో చెక్కభజన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కళారంగానికి వన్నె తెచ్చిన చెక్కభజన నేటికి గ్రామీణ ప్రాంతాలలో కనిపిస్తుండటంతో చెక్కభజన కళాకారులు ఇప్పటికీ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చెక్క భజన కళాకారులకు తగిన గుర్తింపు ఇవ్వాలని కళాకారులు కోరుతున్నారు.

ప్రోత్సాహక బహుమతులు అందించాలి

ప్రస్తుత కంప్యూటర్ కాలంలో కూడా చెక్కభజనలు గ్రామీణ ప్రాంతాలలో ప్రజలను ఆకర్షిస్తున్నాయి. అలాంటి చెక్కభజన కళాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన గుర్తింపును ఇచ్చి ప్రోత్సాహక బహుమతులు అందిస్తే ఇంకా ఇష్టంగా చెక్కభజన కార్యక్రమాన్ని చేపడతారు. – రామచంద్రుడు, చెక్కభజన గురువు, మల్లికార్జునపురం, పులివెందుల

చెక్కభజన కళాకారులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

గ్రామీణ ప్రాంతాలలో చెక్కభజ నిర్వహిస్తున్న చెక్కభజన కళాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చెక్కభజన రంగం, చెక్కభజనపై ఇష్టం ఉన్న కళాకారులు నేటికీ గ్రామీణ ప్రాంతాలలో పర్వదినాలు, పండుగలు, గజ్జెపూజ లాంటి కార్యక్రమాల ద్వారా చెక్కభజన కార్యక్రమాలు అందరిని ఆకట్టుకుంటున్నాయి. – వెంగముని, చెక్కభజన గురువు, పులివెందుల